1

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

ఆదివారం | డిసెంబర్ 29, 2024 | www.navatelangana.com

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని గుండ్లపేట గ్రామానికి చెందిన మొగిలి భీమయ్యకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కును శనివారం బీజేపీ మండల అధ్యక్షుడు జునుగరి మధుకర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారుల ఇంటి వద్ద అందజేయాలని ఎమ్మెల్యే హరీష్ బాబు ఆదేశాల మేరకే అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దెబ్బటి మహేష్, బండి ప్రభాకర్ పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-కౌటాల

కాంగ్రెస్ సీనియర్ నాయకులు హన్మంతు తల్లి ఇటీవల మృతి చెందడంతో కుటుంబ సభ్యులను అసెంబ్లీ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ పరామర్శించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దల దేవయ్య, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు కస్తూరి సత్యనారాయణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాసనగొట్టు సంతోష్, మండల అధ్యక్షులు శ్రీను, సీనియర్ నాయకులు ఫైసలే బిన్ సులేమాన్, యూత్ కాంగ్రెస్ నాయకులు వంశీ, జగదీష్ ఉన్నారు.



రాష్ట్ర స్థాయిలో రాణించి పథకాలు తీసుకురావాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా
- క్రీడాకారులకు దుస్తుల పంపిణీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గ్రామీణ ప్రాంత క్రీడకారులను గుర్తించి క్రీడల్లో రాణించేలా ప్రభుత్వం సీఎం కప్ పోటీలను నిర్వహిస్తోందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు స్పోర్ట్స్ దుస్తులను శనివారం క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ పంపిణీ చేశారు. రాష్ట్ర స్థాయిలో రాణించి జిల్లాకు పథకాలు తీసుకురావాలని ఆకాక్షించారు. అనంతరం క్రీడాకారుల వివరాలు తెలుసుకుంటూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సహం అందించి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా సీఎం కప్ పోటీలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ నెల 30న హైదరాబాద్, ఖమ్మం, వరంగల్ తదితర ప్రాంతాల్లో జరిగే క్రీడా పోటీల్లో జిల్లా క్రీడాకారులు పాల్గొంటారన్నారు. గ్రామీణ స్థాయి నుంచి ఏ విధంగానైతే కష్టపడి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారో అదే స్ఫూర్తిని ప్రదర్శిస్తూ రాష్ట్ర స్థాయిలో పథకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌ఓ వెంకటేశ్వర్లు, గిరిజన క్రీడాభివృద్ధి అధికారి పార్థసారథి, రాజేష్, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వే వేగం పెంచాలి



కౌటాల: ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో వేగం పెంచాలని ఎంపిడిఓ కోట ప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని ముత్యంపేట, కౌటాల గ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించారు. లబ్దిదారుల వివరాలు సరిగా నమోదు చేస్తూ సర్వేలో వేగం పెంచాలని ఎన్యుమరేటర్లకు సూచించారు.

వాంకిడి : మండలంలో పంచాయతీ కార్యదర్శుల ద్వారా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల ఆన్‌లైన్ సర్వేను సరండి, బెండారా గ్రామాల్లో శనివారం ఎంపీడీవో వి.ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు ఆన్‌లైన్ చేసిన వివరాలను తన దగ్గర ఉన్న వివరాలతో పోల్చి చూసి తన లాగిన్ ద్వారా నమోదు చేశారు. అనంతరం గ్రామ పంచాయతీలలో నిర్వహిస్తున్న నర్సరీలను పరిశీలించారు. ఆయన వెంట ఏపీఓ శ్రావణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

మాజీ ప్రధానికి ఘన నివాళి



దహెగాం : మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో క్లబ్ అధ్యక్షుడు మానేటి రామ్మోహన్ ఆధ్వర్యంలో శనివారం మాజీ ప్రధాని, దివంగత నేత మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళులు అర్పించారు. ముందుగా పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్మోహన్‌సింగ్ భారత ప్రధానిగా, ఆర్థికవేత్తగా అనేక సంస్కరణలు తీసుకొచ్చారని అన్నారు. ఆయన లేని లోటు దేశానికి తీరనిదని సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండలాధ్యక్షుడు రాపర్తి ధనుంజయ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గంద వెంకటేష్, విద్యుత్ శాఖ ఏఈ రవీందర్, పంచాయతీ కార్యదర్శి ప్రణీత్‌బాబు, ప్రెస్‌క్లబ్ సభ్యులు, వర్తక సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి చర్యలు

చింతలమానేపల్లి : గూడెం గ్రామపంచాయతీలోని శివపెల్లిలో వెలిసిన స్వయంభు శ్రీ శంభో మహదేవ్ గోటు సమితి దేవాలయంలో ఆలయ కమిటీ సభ్యులు మన్నెగూడెం బండి ఇస్తారి స్వామి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గూడెం గ్రామం నుండి శివపెల్లి గ్రామానికి ఆలయం వరకు నూతన రోడ్డు మంజూరుకు కలెక్టర్‌తో పాటు ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణక్క ద్వారా జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం మండలంలోని ఆదివాసి గిరిజనుల భూములకు రక్షణ కల్పిస్తూ సాగునీటి సౌకర్యం ఏర్పాటు అంశంపై వారికి విన్నవించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో కొమరం కనుకయ్య, మండల అధ్యక్షులు భూష శంకర్, బెజ్జూర్ మండల అధ్యక్షులు కొడప శంకర్, బెజ్జూర్ మండల సార్‌మేడి ఆత్రం నందరం, బెజ్జూర్ మండల ప్రధాన కార్యదర్శి మడావి గిర్మాజి, శివపెల్లి పటేల్ పోర్సేటి పొట్టి, కోయపెల్లి పటేల్ పాల్గొన్నారు.



విద్యా, వైద్యం మెరుగు..!

- పాఠశాలల్లో మౌళిక వసతులు..ఉపాధ్యాయుల నియామకం
- కామన్‌మెనూ ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం అమలు
- సూపర్ స్పెషాలిటీలో అందుబాటులోకి వివిధ రకాల సేవలు
- పల్లె, బస్తీ దవఖానాల్లో వైద్యులు, సిబ్బంది నియామకం
- ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది మెరుగుపడిన పరిస్థితులు

2024 నవతెలంగాణ విద్యా, వైద్యం రౌండప్

ఉమ్మడి జిల్లాలో గతేడాదితో పోల్చుకుంటే విద్యా..వైద్య సేవల పరిస్థితి కాస్త మెరుగుపడింది. సర్కారు బడుల్లో మౌళిక వసతులు కల్పించడం.. నూతన ఉపాధ్యాయుల నియమించడం..ఇప్పటికే పనిచేస్తున్న వారికి బదిలీలు, పదోన్నతులు చేపట్టడం ద్వారా విద్యావ్యవస్థ కాస్త గాడిలో పడుతోంది. మరోపక్క ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన గురుకులాలు, ఆశ్రమ బడులు, ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ వసతిగృహాల్లో కామన్‌మెనూ అమలు చేయడం ద్వారా విద్యార్థులకు రుచికరమైన భోజనంతో పాటు పౌష్టికాహారం లభిస్తోంది. ఇక వైద్య పరిస్థితులు సైతం మునుపటి కంటే కాస్త మెరుగ్గానే కనిపిస్తున్నాయి. ఈ ఏడాది సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో న్యూరో, ఆంకాలజీ, యూరాలజీ వంటి సేవలు అందుబాటులోకి రావడం అనేక మందికి ప్రయోజనం చేకూరుస్తోంది. వీటితో పాటు జిల్లాలోని బస్తీ, పల్లె దవాఖానాల్లో వైద్యులు, సిబ్బందిని నియమించడం ద్వారా గ్రామీణ పేదలకు వైద్య సేవలు సులభతరంగా మారుతున్నాయి.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో విద్యా వ్యవస్థ పరిస్థితి క్రమక్రమంగా మెరుగుపడుతోంది. ఇది వరకు ఉపాధ్యాయుల కొరతతో తీవ్రంగా ఇబ్బందులు ఎదురుకాగా మౌళిక వసతుల సమస్యలు సైతం తీవ్రంగా వేధించాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ ఏడాది నిరుద్యోగుల ఆశలను నిజం చేసేలా మెగా డీఎస్సీ నిర్వహించింది. ఉమ్మడి జిల్లాలో 1265 పోస్టుల భర్తీకి అనుమతించగా.. ఇందులో 1164 పోస్టులను భర్తీ చేశారు. వివిధ కారణాలతో 101 పోస్టులు భర్తీ కాలేకపోయాయి. అభ్యర్థులకు పోస్టింగ్‌లను సైతం కేటాయించగా.. వివిధ బడులకు వెళ్లి బోధన చేస్తున్నారు. దీంతో సర్కారు బడుల్లో కొంత వరకు బోధకుల కొరత తీరినట్లయింది. మరోపక్క ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను సైతం పూర్తిచేయడంతో వారిలోనూ ఆనందం వ్యక్తమవుతోంది. సుదీర్ఘకాలంగా ఉద్యోగ, ఉపాధ్యాయులను వెంటాడుతున్న బదిలీలు, పదోన్నతులను ప్రభుత్వం చేపట్టింది. ఉమ్మడి జిల్లాలో సుమారు 5వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు బదిలీలు జరగగా.. సుమారు 2వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించాయి. ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల పేరిట నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని సర్కారు బడులను బాగు చేయాలని సంకల్పించింది. ఆదిలాబాద్ జిల్లాలో 678 బడులు ఉండగా 649 బడులను ఈ పథకం కింద తీసుకొని తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్ల సౌకర్యం, తరగతి గదుల నిర్మాణం, టేబుల్‌లు, ఫ్యాన్లు, ఇతరాత్ర సౌకర్యాలను కల్పించి సర్కారు బడులకు నూతన హంగులు సంతరించుకునేలా చేసింది. ఇందుకుగాను ఆదిలాబాద్ జిల్లాలో రూ.25కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.వీటితో పాటు ప్రభుత్వం ఇటీవల నియోజకవర్గానికి ఒక సమీకృత గురుకులాలకు శ్రీకారం చుట్టగా.. తొలి విడతలో మంచిర్యాల నియోజకవర్గంలో ఈ బడి నిర్మాణాన్ని ప్రారంభించారు. మరోపక్క వివిధ రకాల గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో కామన్‌మెనూ అమలు చేస్తోంది. ఇందులో భాగంగా పూరీలు, వడలు, రాగిజావ వంటి టిఫిన్లతో పాటు మటన్, చికెన్, కోడిగుడ్లు తదితర వాటిని సమకూరుస్తోంది. అన్ని రకాల వసతిగృహాల్లో ఒకే రకమైన పౌష్టికాహారం కలిగిన భోజనాన్ని అందిస్తుండటంతో అనేక మంది పేద విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతోంది.

వైద్య సేవల్లోనూ మెరుగు..!

ఉమ్మడి జిల్లాలో గతం కంటే ఈ ఏడాది వైద్య సేవలు కాస్త మెరుగుపడ్డాయనే చెప్పొచ్చు. ఇది వరకే జిల్లాకు ఒకటి చొప్పున మెడికల్ కళాశాలలు కొనసాగుతుండగా.. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఈ ఏడాది సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో వివిధ రకాల సేవలు అందుబాటులో రావడం జిల్లా ప్రజలకు మేలు చేస్తోంది. న్యూరోసర్జరీ, యూరాలజీ, పీడియాట్రిక్ సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ వంటి సేవలు లభించడంతో అనేక మంది ఇక్కడే వైద్య చికిత్సలు చేయించుకుంటున్నారు.



రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి

ముఖ్యంగా క్యాన్సర్, థైరాయిడ్ వంటి వ్యాధులకు శస్త్రచికిత్సలు నిర్వహిస్తుండటంతో అనేక మందికి లాభం చేకూరుతోంది. ఇతర ప్రాంతాలకు వెళ్లి రూ.లక్షలు ఖర్చు చేసుకునే పరిస్థితి క్రమంగా దూరమవుతోంది. మరోపక్క రూ.11కోట్లు వెచ్చించి తీసుకొచ్చిన ఎంఆర్ఐ యంత్రం సైతం పనిలోకి వచ్చింది. ప్రస్తుతం అత్యవసర సేవలకే వినియోగిస్తుండగా.. ఈ స్కానింగ్ సేవలను అందరికీ అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. ఈ ఆస్పత్రిలో ఎనిమిది విభాగాలకు చెందిన సేవలు లభించాల్సి ఉండగా.. ఇప్పటికీ కొన్ని ప్రారంభం కాలేదు. మరోపక్క ప్రస్తుతం ఆయా విభాగాలకు ఒకరిద్దరు వైద్యులు మాత్రమే ఉండటంతో వారిపై పని ఒత్తిడి పడుతోంది. పూర్తిస్థాయిలో వైద్యులు గుండె ఆపరేషన్ల వంటి వాటికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మరోపక్క పల్లె, బస్తీ దవఖానాల్లో ప్రభుత్వం వైద్యులు, సిబ్బందిని నియమించడంతో గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు మెరుగుపడ్డాయి. రిమ్స్‌లో మోకాళ్ల చిప్పల మార్పిడి శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. రిమ్స్‌లో బయోవ్యర్థాల నిర్వహణ సక్రమంగా ఉండటంతో పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు నుంచి రిమ్స్‌కు రాష్ట్రస్థాయి గ్రీన్ ఛాంపియన్ అవార్డు లభించింది.

మరోపక్క ఉమ్మడి జిల్లాలోని పీహెచ్‌సీలతో పాటు ఉట్నూర్‌లోని జిల్లా ఆస్పత్రిలోనూ సరిపడా వైద్యులు లేకపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు లభించడంలో ఇబ్బందికరంగా మారుతోంది.



అమ్మ ఆదర్శ పాఠశాల



సూపర్ స్పెషాలిటీలో క్లిష్టతరహ ఆపరేషన్ నిర్వహించిన వైద్యుల బృందం(ఫైల్)



పీజీటీగా నియామకపత్రం అందుకుంటున్న అభ్యర్థి(ఫైల్)

'ఇక్కడ దొంగతనాలు నేర్పబడును'

- ఇది కాగజ్‌నగర్ జ్యోతిబాపూలే పరిస్థితి
- అధ్వాన్నంగా మారిన బాలుర పాఠశాల నిర్వహణ
- చోద్యం చూస్తున్న అధికారులు



తమ పిల్లలు మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తల్లిదండ్రులు భావిస్తారు. అందుకే పిల్లలు తమకు దూరంగా ఉంటున్నారనే బాధను కడుపులోనే దిగమింగుకుంటూ గురుకులాలకు పంపిస్తున్నారు. కాని కొన్ని గురుకులాలలో చదువుకు బదులు దొంగతనాలు నేర్పిస్తున్నారనే విషయం ఆ తల్లిదండ్రులకు తెలిస్తే వారి బాధ వర్ణనాతీతంగా ఉంటుంది. ఇదే జరుగుతోంది కాగజ్‌నగర్ మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల (హెడ్ క్వార్టర్: చిన్నరాస్పెల్లి) పాఠశాలలో. ఇది చెపితే నమ్మని నిజమే అయినా వాస్తవంగా లోతుల్లోకి వెళ్లి పరిశీలిస్తే అసలు నిజం బయటపడింది.

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పిల్లలు తెలిసీ తెలియని వయస్సులో తప్పులు చేయడం సహజం. తల్లిదండ్రులు ఆ తప్పులను గమనించి ఇంకోసారి తప్పు చేయవద్దని మందలించి అప్పటి నుండి వారిపై ఒక కన్నేసి ఉంచి వారు సన్మార్గంలో నడిచే విధంగా జాగ్రత్తలు తీసుకుంటారు. ఐదో తరగతిలోనే గురుకులాలకు పంపించే తల్లిదండ్రులకు తమ పిల్లలను మంచి పౌరులుగా తీర్చిదిద్దే ప్రతిభావంతుల వద్ద ఉంచామనే భరోసా ఉంటుంది. కాని వారి నమ్మకాన్ని వమ్ము చేస్తూ కొన్ని గురుకులాల నిర్వాహకులు విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తూ పిల్లల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నారు. కచ్చితంగా ఇదే జరుగుతోంది కాగజ్‌నగర్‌లోని మహాత్మాజ్యోతిబాపూలే బాలుర పాఠశాలలో. ఇక్కడి పిల్లలు గత కొన్ని రోజులుగా అర్ధరాత్రి సమయంలో బయటకు వెళ్లి తినుబండారాలను అపహరించినా ఈ పాఠశాల నిర్వాహకులకు సోయి లేకపోవడం వీరి నిర్లక్ష్యాన్ని బహిర్గతం చేస్తోంది. ఈ పాఠశాలకు సమీపంలోనే ఐస్‌క్రీం తయారీకేంద్రం ఉంది. రాత్రి సమయంలో ఈ కేంద్రం వద్ద ఐస్‌క్రీం బండ్లను నిలిపి ఉంచుతారు. పది రోజుల క్రితం వరకు ఈ బండ్లలో ఉంచిన ఐస్‌క్రీంలు మాయమవుతున్నాయి. దీనిని గమనించిన ఐస్‌క్రీం తయారీకేంద్రం నిర్వాహకుడు వారం రోజుల క్రితం తన వద్ద ఉన్న సీసీ పుటేజీని పరిశీలించగా చేదు నిజం బయటపడింది. కొన్ని రోజుల నుండి విద్యార్థులు అర్ధరాత్రి సమయంలో పాఠశాల గోడ దూకి ఐస్‌క్రీం కేంద్రం ముందు ఉంచిన ఐస్‌క్రీం బండ్లలో నుండి ఐస్‌క్రీంలు తీసుకొని తింటున్నారు. ఇది కొన్ని రోజులుగా జరుగుతున్నా పాఠశాల వాచ్‌మెన్ కాని, అక్కడి సిబ్బంది కాని పరిశీలించలేదు. తెలిసీ తెలియని వయస్సులో పిల్లలు తప్పు చేశారని భావించిన ఐస్‌క్రీం యాజమాని రచ్చ చేయకుండా తనకు జరిగిన నష్టానికి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయగా, పాఠశాల సిబ్బంది ఆ డబ్బులను కూడా విద్యార్థుల తల్లిదండ్రుల నుండే వసూలు చేసినట్లు తెలిసింది. ఒక్కో విద్యార్థి నుండి రూ. 1000 చొప్పున సుమారు రూ. 15 వేల వరకు వసూలు చేసి అందులో నుండి ఐస్‌క్రీం యాజమానికి రూ.6 వేలు ఇచ్చి మిగిలిన డబ్బులను కూడా సిబ్బందే స్వాహా చేసినట్లు సమాచారం. ఈ వయస్సులోనే పిల్లలు తప్పుదోవ పడితే రేపు సమాజంలో వారు మంచి పౌరులుగా ఏ విధంగా ఎదుగుతారనేది ఇక్కడ ప్రశ్నార్థకంగా మారింది.

ఆర్‌సీఓది అదే నిర్లక్ష్యం

ఈ విషయమై రీజనల్ కో ఆర్డినేటర్ గోపీచంద్‌ను 'నవతెలంగాణ' సంప్రదించింది. ఆయన కూడా దీన్ని 'లైట్' గానే తీసుకోవడం ఇక్కడ గమనార్హం. పిల్లలు గోడ దూకి వెళ్లి ఐస్‌క్రీం తింటున్నారనే విషయం కాని, విద్యార్థి అస్వస్థతకు గురై ఆసుపత్రి పాలైన విషయం కాని తనకు తెలియదని బాధ్యరాహిత్యంగా సమాధానం ఇవ్వడం ఆయన ఏ మేరకు సక్రమంగా విధులు నిర్వహిస్తున్నాడనేదాన్ని బహిర్గతం చేస్తోంది.

అరోగ్యం విషయంలో కూడా నిర్లక్ష్యమే

ఈ పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ చూపడం లేదు. ప్రస్తుతం గురుకులాలలో విద్యార్థులు అస్వస్థతకు గురై ఆసుపత్రుల బారిన పడుతుండడంతో జిల్లా కలెక్టర్ నుండి మొదలుకొని ఉన్నతాధికారులు అంతా గురుకులాల బాట పడుతున్నారు. అయినా ఇక్కడి పాఠశాల ప్రిన్సిపల్‌కు కాని, సిబ్బందికి కాని అవేవీ పట్టడం లేదు. ఇటీవల 9వ తరగతి చదువుతున్న జాగరి అవినాష్ అనారోగ్యానికి గురి కాగా సకాలంలో ప్రిన్సిపల్ కుటుంబసభ్యులకు సమాచారం అందించలేదు. అతని పరిస్థితి విషమంగా మారిన తర్వాత తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో వారు వచ్చి ఆ విద్యార్థిని ఆసుపత్రికి తరలించారు. కాగజ్‌నగర్‌లో వైద్యులు చూడకపోవడంతో మంచిర్యాలకు తరలించారు. అక్కడ వారం రోజుల తర్వాత ఆ విద్యార్థి కోలుకున్నాడు. కాని ఆసుపత్రి యాజమాన్యం ఆ తల్లిదండ్రులకు 3.60 లక్షల బిల్లును వేసింది. నిరుపేద కుటుంబం అంత మొత్తం చెల్లించలేక రెండు రోజుల క్రితం తమ బాధను స్థానిక ఎమ్మెల్యే వద్ద మొర పెట్టుకున్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్



బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సీఐ నవీన్ కుమార్ అన్నారు. శనివారం సోన్ పోలీస్ స్టేషన్‌లో నెలవారి సమీక్షను సోన్ సీఐ నవీన్ కుమార్ నిర్వహించారు. పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీసులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని శాంతి భద్రతల పరిరక్షణకు పాటు పడాలని సూచించారు. కేసులను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై షేక్ అహ్మద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

టోల్ ప్లాజా డివైడర్‌ను ఢీకొట్టిన లారీ

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్



టోల్ ప్లాజా డివైడర్‌ను లారీ ఢీకొన్న ఘటన శుక్రవారం అర్ధరాత్రి సోన్ మండలం గంజాల్ టోల్ ప్లాజా వద్ద జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అమరావతి నుంచి ఓ లోడుతో వస్తున్న టీఎన్ 28 బీఎక్స్ 6935 లారీ టోల్ ప్లాజా వద్దకు రాగానే డివైడర్‌ను ఢీ కొట్టిందని, దీంతో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయని తెలిపారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

కలెక్టరేట్ ఎదుట ఎస్ఎస్ఏ ఉద్యోగుల అర్ధనగ్న ప్రదర్శన

- 19వ రోజుకు చేరుకున్న సమ్మె
- సమ్మెకు బోథ్ ఎమ్మెల్యే సంఘీభావం, ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తమను రెగ్యులర్ చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న సమ్మె కొనసాగుతుంది. శనివారం ఈ సమ్మె 19వ రోజుకు చేరుకోగా, కలెక్టరేట్ ఎదుట అర్ధనగ్న ప్రదర్శన చేపట్టి వినూత్న నిరసన తెలిపారు. గత 19 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రెగ్యులర్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ధరం సింగ్, పార్థసారథి, దేవదర్శన్, ప్రకాష్, ప్రియంక, రాజన్న, శ్రీకాంత్, బోజన్న పాల్గొన్నారు.

ఇచ్చిన డిక్లరేషన్ అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం...

కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు ఏ గ్రామంలో పోయిన అక్కడ ఓ డిక్లరేషన్ ఇచ్చిందని, కానీ దాన్ని అమలు చేయడం లేదని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించి సంఘీభావం తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికార కోసం కాంగ్రెస్, సీఎం రేవంత్‌రెడ్డి హామీలిచ్చి అధికారంలోకి వచ్చి విస్మరించారని ఆరోపించారు. ఆయన నిర్లక్ష్యం కారణంగా చదువులు చెప్పే ఉపాధ్యాయులు రోడ్డుపైకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలు మూతపడ్డాయని తెలిపారు.



తెలంగాణ వచ్చిన తరువాత మాజీ సీఎం కేసీఆర్ చాలా హామీలు అమలు చేశారని, కొన్ని పూర్తి కాలేక న్యాయం జరగలేదన్నారు. ఇప్పుడున్న ప్రభుత్వం మేం రాగానే ఇది చేస్తాం.. అది చేస్తామని అనేక హామీలు ఇచ్చి పట్టించుకోవడం లేదన్నారు. గతంలోనే ఉన్న ఉద్యోగుల భర్తీ నోటిఫికేషన్‌ను పూర్తి చేసి తాము చేసినట్టు గొప్పలు చెబుతున్నారని ఆరోపించారు. మాట్లాడితే కేసీఆర్ రావాలని అసెంబ్లీలో చెబుతున్న సీఎం ఇచ్చిన హామీలపై దృష్టి లేదని ఆరోపించారు. సమ్మె చేస్తున్న ఉద్యోగుల కోరిక మేరకు దీక్ష శిబిరం నుంచి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో ఫోన్‌లో మాట్లాడి భరోసా కల్పించారు. రూ.50వేలు ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు తిరుమల్‌గౌడ్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల తనిఖీ



నవతెలంగాణ-బేల

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం డీఐఈఓ రవీందర్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థుల హాజరును పరిశీలించారు. కళాశాలలోని పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు శాతం, పరీక్ష ఫలితాలు, వార్షిక ప్రణాళిక, 90 రోజుల ప్రణాళిక, ఎంసెట్, నీట్ పోటీ పరీక్షలపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పట్టుదల క్రమశిక్షణతో చదువుకొని మంచి ప్రణాళిక ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపల్ ఎస్.భగవాండ్లు, అధికారులు మొహసిన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో బావిలో దూకి ఆత్మహత్య

నవతెలంగాణ-తలమడుగు

మద్యం మత్తుతో పాటు భార్యతో గొడవపడి గ్రామంలోని బావిలో పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మండలంలోని రుయ్యాడి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ దుర్గనగర్ కాలనీకి చెందిన మీదం గంగన్న(45) రుయ్యాడి గ్రామానికి జీవనోపాధి కోసం రాగా, శుక్రవారం రాత్రి మద్యం మత్తుతో పాటు భార్యతో గొడవపడి గ్రామంలోని బావిలో పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై అంజమ్మ తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమారులు ఉన్నారు.

రాంనగర్‌లో కబడ్డీ పోటీలు ప్రారంభం



నవతెలంగాణ-పెంబి

మండలంలోని రాంనగర్ గ్రామంలో చిరుత యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ ప్రీమియర్ లీగ్‌ను శనివారం గ్రామపంచాయతీ సెక్రటరి కామ్రాన్, గ్రామ కారోబారి సిద్ధు నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాలో గెలుపు ఓటములు సహజమని అన్నారు. క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసికోల్లాసం ఉంటుందని అన్నారు. ఈ క్రీడాల్లో గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతి రూ.10వేలు, రెండో బహుమతి రూ.5వేలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ నాయక్, సిద్ధు నాయక్, మాజీ ఎంపీటీసీ రామారావు, చిరుత యూత్ సభ్యులు కైలాస్, రవి, నరేందర్, రోహిదాస్, ఉపేందర్, నాందేవ్, రాజేష్, నవీన్ ఉన్నారు.

టీయూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట శనివారం తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్-2025 క్యాలెండర్‌ను ఎంఈఓ కె.పోశెట్టి, ఎంపీడీఓ రమేష్, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల, బాలురు ప్రధానోపాధ్యాయులు మహమూద్ హుస్సేన్, చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ టీయూటీఎఫ్ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలోనే కాకుండా అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ ఉండటం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు అప్పాల శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బైరి సతీష్ కుమార్, జిల్లా కార్యదర్శులు మోహన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షురాలు వీణ, రాజేశ్వర్, కార్యదర్శులు గణేష్, రమేష్ చందర్, కోశాధికారి నవనీత్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి నవీన్‌రెడ్డి, నవ్యశ్రీ, శంకర్ పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు గడువు పెంపు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులలో ప్రవేశాలు పొందేందుకు స్పెషల్ అడ్మిషన్ల గడువు పొడగించినట్టు డీఈఓ ప్రణిత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులలో చేరేందుకు 24తో గడువు ముగియగా ఈనెల 30 వరకు పొడగించినట్టు పేర్కొన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.తెలంగాణఓపెన్‌స్కూల్.ఓఆర్‌జీ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోని అడ్మిషన్ ఫీజు చెల్లించి రశీదు పొంది, సంబంధిత అధ్యయన కేంద్రాలలో అడ్మిషన్ ఫారం ప్రింటౌట్‌తో పాటు ధృవపత్రాలను సమర్పించాలని సూచించారు. అధ్యయన కేంద్రాల కోఆర్డినేటర్లు, మండల విద్యాశాఖాధికారులు ఉపాధ్యాయ సిబ్బంది ఈ విషయం విస్తృత ప్రచారం చేసి అడ్మిషన్లు పెంచాలన్నారు.

నేడు విద్యార్థులకు తరగతులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వారి డిగ్రీ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్, డిగ్రీ రెండవ సంవత్సరం మూడవ సెమిస్టర్, డిగ్రీ మూడవ సంవత్సరం ఐదవ సెమిస్టర్ విద్యార్థులకు తరగతులను ఈనెల 29న నిర్వహిస్తున్నట్లు యూనివర్సిటీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ జగ్రామ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే పీజీ మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరం కాంటాక్ట్-కం కౌన్సిలింగ్ తరగతులను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ తరగతులకు విద్యార్థిని, విద్యార్థులందరూ హాజరు కావాలని సూచించారు.

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే పాయల శంకర్‌ను కలిసి సమస్యలపై వినతిపత్రం అందించారు. మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఈఎస్ఐ పెరిగిన నిత్యావసర ధరకు అనుగుణంగా రూ.26 వేల వేతనం చెల్లించేలా చూడాలని కోరారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అసెంబ్లీలో కార్మికుల సమస్యలపై చర్చిస్తామన్నారు. అదే విధంగా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచే విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అగ్గిమల్ల స్వామి, జిల్లా కార్యదర్శి దర్శనాల నగేష్, యూనియన్ నాయకులు శ్యామ్, కుమార్, గౌస్, ఖాజా, జనార్ధన్ పాల్గొన్నారు.

కేజీబీవీని సందర్శించిన డీఈఓ



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

మండలంలోని అనంతపేట్ కేజీబీవీని శనివారం డీఈఓ రామారావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు చక్కగా చదువుకోవాలని, అందించిన భోజనాన్ని సమయానికి తినాలని అన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది తమ వేతనాల కోసం సమ్మె చేస్తున్నారని అన్నారు. వారు సమ్మె విరమించేంత వరకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేశామని విద్యార్థులు వారికి సహకరించాలని కోరారు. విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పినట్టుగా నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాత్కాలికంగా ఏర్పాటు చేయబడిన ప్రత్యేకాధికారి దేవిప్రియ, ఉపాధ్యాయురాలు డీసీబీ అసిస్టెంట్ సెక్రటరీ వానుమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య పాఠశాలలో యోగా శిక్షణ



నవతెలంగాణ-బోథ్

మండలంలోని కనుగుట్ట జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఆరోగ్య పాఠశాలలో భాగంగా యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షకులు మునిగెల యోగిత విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ యోగా ఆసనాలవల్లే కలిగే ప్రయోజనాలు విద్యార్థులకు వివరించారు. యోగా మానవుడికి నిత్యజీవితంలో భాగమైందని, ఇలాంటి యోగా కార్యక్రమాలను విద్యార్థులకు నేర్పాలనే ఆలోచన పిల్లల్లో నూతన ఉత్సాహాన్ని అందిస్తుందని అన్నారు. ఆరోగ్య పాఠశాలలో భాగంగా ఇలాంటి కార్యక్రమంలో మమ్మల్ని భాగస్వామ్యం చేసిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా జిల్లా ప్రోగ్రామింగ్ ఆఫీసర్ ప్రీతల్ రాథోడ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు పిల్లల ఆలోచన విధానాన్ని మారుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జాదవ్ మహేందర్, ఉపాధ్యాయులు ఇ.రాజేశ్వర్, రమణ, సుభాష్‌రెడ్డి, ప్రహ్లాద్, రవీందర్, అంకిత పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు నిర్వహణ సక్రమంగా నిర్వహించాలి

- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్



నవతెలంగాణ-నిర్మల్

డంపింగ్ యార్డు నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి నిర్మల్ సమీపంలో డంపింగ్ యార్డ్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. డంపింగ్ యార్డ్ నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. నిర్మల్ పట్టణంలోని ప్రతి ఇంటి నుంచి ప్రతి రోజు తడి, పొడి చెత్తలను వేరుగా సేకరించి డంపింగ్ యార్డ్ తరలించాలని సూచించారు. సెగ్రిగేషన్ ప్రదేశంలో ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ డబ్బాలు, పేపర్, తుక్కు, గాజు సీసా, అట్ట పెట్టెలను వేరువేరుగా విభజించి పునర్ వినియోగానికి వీలున్న చెత్తను వేరు చేసి ఉంచాలన్నారు. డంపింగ్ యార్డ్ ఆవరణలో తక్షణమే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, అగ్ని ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోజువారీగా డంపింగ్ యార్డ్‌కు వస్తున్న చెత్త, నిర్వహణ, సెగ్రిగేషన్, తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, పశుసంవర్థక శాఖ అధికారి బాలీద్ అహ్మద్, నిర్మల్ రూరల్ తహసీల్దార్ సంతోష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలి

- కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న డిమాండ్ చేశారు. శనివారం గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ముందుగా సీఐటీయూ కార్యాలయం నుంచి ర్యాలీగా తరలివచ్చారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, మల్టిపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకుండా పోయిందన్నారు. ఆరు నెలల నుంచి వేతనాలు రాక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. జీఓ నెంబర్ 51ని సవరించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేసి కేటగిరి వారీగా వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. అధికారంలో లేని సమయంలో సీతక్క గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పుడు గ్రామాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న కూడా సమస్యల గురించి మాట్లాడటం లేదన్నారు. మంత్రి స్పందించి పెండింగ్ వేతనాలతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ శ్యామలదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కిరణ్, విలాస్, అరవింద్, రఫీ, శంకర్, రాజు, ఇంద్రజ్, లస్మన్న పాల్గొన్నారు.

పత్తి కర్రలను బయోమాస్‌గా వినియోగించుకోవాలి



నవతెలంగాణ-పెంబి

పత్తి రైతులు దూది ఏరిన తర్వాత మిగిలే పత్తి కర్రలను పోగుచేసి కాల్చకుండా కాటన్ స్టాక్ శ్రెడ్డర్ యంత్రం సహకారంతో కర్రను చిన్న చిన్న ముక్కలుగా, చిప్స్‌లాగా కత్తిరించి నేలలోనే కలియదున్నడం వల్ల భూమికి అవసరమైన బయోమాస్‌ను అందించిన వాళ్లమవుతామని పెంబి మండల వ్యవసాయాధికారి నవీన్ తెలిపారు. శనివారం మండలంలోని అంకెనా, రాయదారి, పులగంపంద్రి గ్రామాలలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ముగిసి రబీ సాగు ప్రారంభమైన సందర్భంగా ప్రస్తుతం రైతులు పత్తి కర్రలను తొలగించి, కుప్పలుగా వేసి కాల్చడం చేస్తున్నారని దీనికి బదులుగా కాటన్ స్టాక్ శ్రెడ్డర్ అనే యంత్రం సహకారంతో ట్రాక్టర్ ఉపయోగించి పత్తి కర్రలను చిప్స్ లాగా కత్తిరించి నెలలోనే కలియ దున్నడం వల్ల ఎకరానికి సుమారుగా నాలుగు టన్నుల బయోమాస్‌ను నేలకు చేకూర్చిన వాళ్లమవుతామని తెలిపారు. నేలలో కర్బన పదార్థాలు చేర్చడం వల్ల నేల వదులుగా మారి తదుపరివేసే పంటలకు సంబంధించిన మొక్కల వేర్లకు గాలి ప్రసరణ, నీటి లభ్యతను పెంచడంతో పాటుగా వేరు వ్యవస్థ వద్ద సూక్ష్మ వాతావరణాన్ని అభివృద్ధి పరుస్తుందని తెలిపారు. రైతు తప్పనిసరిగా పత్తి కర్రలను కాల్చకుండా నేలలో కలియ దున్నుకోవాలని సూచించారు. కాటన్ స్టాక్ శ్రేడర్‌ను ట్రాక్టర్‌కు బిగించి వాడుకోవచ్చని, కేవలం ఒక లక్ష నుంచి రెండు లక్షల రూపాయల మధ్యలో ఈ యంత్రము మార్కెట్‌లో అందుబాటులో ఉన్నట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రాజ్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-ఇచ్చోడ

తాగుడుకు బానిసై జీవితంపై విరక్తి చెంది వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని జున్ని గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. జున్ని గ్రామానికి చెందిన అడిగే జనార్ధన్(50) కొద్ది రోజులుగా తాగుడుకు బానిసై తనలో తాను కుమిలిపోతూ శనివారం తెల్లవారు జామున ఇంటి నుంచి బయలుదేరి తన పొలానికి వెళ్తానంటూ చెప్పి ఇచ్చోడ శివారులోని హనుమాన్ క్రషర్ వద్ద మామిడి చెట్టుకు అందజా ఉదయం 9.30 గంటలకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కొడుకు ఉన్నారు. చనిపోయే ముందు తన కుమార్తెకు వీడియో కాల్ చేసి చనిపోతున్నానని చెప్పినట్లు తెలిపారు. కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తిరుపతి పేర్కొన్నారు.

రైతులకు నష్టం జరగకుండా చూడాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్ర ప్రభుత్వం పత్తి రైతుల కోసం ప్రయోగాత్మకంగా ప్రారంభించనున్న భావంతర్ భుగ్తాన్ యోజన పథకం వల్ల రైతులకు నష్టం చేకూరుతుందని అఖిలపక్ష రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బండి దత్తాత్రి పేర్కొన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ రాజర్షిషాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల ఢిల్లీలో నీతి అయోగ్ మెంబర్ రమేష్‌చాంద్ ఆధ్వర్యంలో వ్యాపారస్తులు, రైతులు రాష్ట్ర ప్రభుత్వాలు హాజరై రైతులకు సంబంధించిన విషయాలను చర్చించారని పేర్కొన్నారు. ఇందులో ముఖ్యంగా పత్తి రైతుల గురించి చర్చించి, ఈ సంవత్సరం తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లాలో పత్తి రైతులు కొనుగోలు కోసం భావంతర్ యోజన పథకం జిల్లాలో ప్రారంభించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కానీ ఈ పథకం విధివిధానాలు తెలుపకుండా, రైతులను చైతన్యం చేయకుండా ప్రారంభిస్తే రైతులకు నష్టం జరిగే అవకాశం ఉందని తెలిపారు. రైతులకు నష్టం జరగకుండా చూడాలని కలెక్టర్‌కు విన్నవించారు.

సమ్మె విరమించి విధుల్లో చేరాలి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

బోధనేతర సిబ్బంది తమ సమ్మెను విరమించాలని, డీఈఓ రామారావు కోరారు. శనివారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట దీక్ష చేస్తున్న కేజీబీవీ బోధనేతర సిబ్బంది వద్దకు వెళ్లి విధుల్లో చేరాలని కోరారు. ఆయన వెంట ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ సిద్ధ పద్మ, సెక్టోరల్ అధికారి సలోమీ కరుణ ఉన్నారు.

చలో హైదరాబాద్‌కు అనుమతివ్వాలి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

తమ సమస్యలను పరిష్కరించాలని ఈనెల 31న ఆశా కార్యకర్తలు చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని తలపెట్టారు. శనివారం నిర్మల్ జిల్లా ఆశా కార్యకర్తలు కార్యక్రమానికి అనుమతి ఇవ్వాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు సబిత మాట్లాడుతూ ఆశాల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

గర్భకోశ వ్యాధి నివారణకు ఉచిత పశువైద్య శిబిరం



నవతెలంగాణ-దండేపల్లి

ఉమ్మడి ఆదిలాబాద్ పశుగణాభివద్ధి సంస్థ జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని గ్రామంలో ఉచిత గర్భకోశ వ్యాధుల నివారణకు ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 33 పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధి నివారణ టీకాలు వేశారు. అనంతరం పశు వైద్యాధికారి ధనరాజ్ మాట్లాడుతూ కొత్త సాంకేతికతతో పశువులలో లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం వల్ల 90 శాతం ఆడ దుడలు పుట్టడం జరుగుతుందని ఈ ప్రక్రియను ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సూపర్‌వైజర్ రవి, పశు వైద్యురాలు సుజాత, గోపాలమిత్రలు శ్రవణ్ కుమార్, కుమారస్వామి, అభిలాష్ పాల్గొన్నారు.

పలు బాధిత కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-తాంసి

మండలంలోని ఆయా గ్రామాల్లోని పలు కుటుంబాలను శనివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మండల నాయకులతో కలిసి పలు కుటుంబాలను పరామర్శించారు. పొన్నారి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ జనరల్ సెక్రటరీ రమణ కుమారుడు ఆపరేషన్ చేసుకొని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న విషయం, తాంసి మండల కేంద్రానికి చెందిన కడిగిరి అశన్న యాదవ్ కుమారుడు సంతోష్ ఇటీవల మరణించారు. గిరిగావ్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ మాజీ కన్వీనర్ తులసిరామ్ మరణించారు. జామిడి గ్రామానికి చెందిన హరీశ్‌రెడ్డి నానమ్మ మరణించిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బాధిత కుటుంబాలను పరామర్శించి మృతి చెందిన కుటుంబాలకు మనోధైర్యానిచ్చారు. ఎమ్మెల్యే వెంట వినోద్‌రెడ్డి, మహేందర్, కృష్ణ, గోవర్ధన్, అశోక్, రఘు, మండలాల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నిరుపేద కొలాం ఆదివాసులకు బాసట

నవతెలంగాణ-ఉట్నూర్

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సమతలగుండం గ్రామంలోని నిరుపేద కొలాం ఆదివాసులకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆయన సతీమణి ధ్రుపద మానవత్వ దృక్పథంతో నిరుపేదలకు చలి తీవ్రత నుంచి రక్షించుకునేందుకు దుప్పట్లతో పాటు నూతన వస్త్రాలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో చలి తీవ్రత అధికంగా పెరగడంతో కనిష్ట స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. నిరుపేదల కోసం తన సహాయ శక్తుల కృషి చేస్తామనీ, రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేస్తుందని, ఇది ప్రజల ప్రభుత్వమని, ప్రభుత్వం కల్పించే సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో ప్రతి పేదవాడికి అందించడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామన్నారు. సేవయే లక్ష్యంగా ముందుకు కొనసాగుతూ ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో సమతల గుండం గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని కౌట్ల(బి) గ్రామానికి చెందిన దేవారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. రైతు సహకార సంఘం ఆధ్వర్యంలో శనివారం బాధిత రైతు కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మ్యాక్స్ సంఘం అధ్యక్షులు నకిరెడ్డి నర్సారెడ్డి, ఉపాధ్యక్షులు అయిర బోజారెడ్డి, కార్యదర్శి ఎలిపెద్ది భూమారెడ్డి, కోశాధికారి లక్ష్మారెడ్డి, డైరెక్టర్లు పోతారెడ్డి, రాంరెడ్డి, మోహన్‌రెడ్డి, సత్యపాల్‌రెడ్డి, వంగ గోవింద్‌రెడ్డిలు పాల్గొన్నారు.

జమాత్ ఈ హింద్ కార్యాలయం ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

జమాత్ ఈ హింద్ ఆదిలాబాద్ కార్యాలయ ప్రారంభోత్సవానికి తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి హజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముఫ్తీ మహమ్మద్ జుబేర్ ఖాస్మీ ప్రధాన కార్యదర్శి జమియత్ ఉలేమా-ఎ-హింద్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఆదిలాబాద్‌టౌన్ సదర్ హఫీజ్ అమీర్ పటేల్, జిలా బోథ్ సదర్ మౌలానా అకీల్ అహ్మద్ ఖాస్మీ, హఫీజ్ అఫ్రోజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జమియత్ ఉలేమా-ఎ-హింద్‌లు హాజరయ్యారు.

నుమాయిష్‌కు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలో నిర్వహించే నుమాయిష్‌కు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నుమాయిష్ నిర్వహణపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి ఆమె అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జనవరి 5 నుంచి 7వ తేదీ వరకు మూడు రోజుల పాటు 'నిర్మల్ ఉత్సవాలు' పేరుతో స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నుమాయిష్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించి జిల్లా శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, విద్య, పెయింటింగ్స్, హస్త కళలు, మహిళా స్వయం సంఘాల ఉత్పత్తుల స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి నుమాయిష్ విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమం ప్రజలందరికీ తెలిసే విధంగా హోర్డింగ్స్ ఏర్పాటు చేసి, కరపత్రాలను పంచాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, కళాకారులతో సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు ఇతర వివరాల కోసం జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి ఫోన్ నెంబరు 9849913071 ను సంప్రదించవచ్చునని తెలిపారు. సమావేశంలో ఆర్డీఓ రత్న కళ్యాణి, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, డీవైఎస్‌ఓ శ్రీకాంత్ రెడ్డి, డీఈఓ పి.రామారావు, డీఎస్‌ఓ కిరణ్ కుమార్, ఈడీఎం నదీమ్, డిఎమ్ హెచ్‌ఓ రాజేందర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జంగుబాయి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-కెరమెరి



మండలంలోని కోటపరందోలి-బిడ్వార్ గ్రామంలో జనవరి 13 జరుగనున్న జంగుబాయి మాతా ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం మండలంలోని హట్టి గ్రామంలో గల గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ-ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తాతో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 13న జరుగనున్న జంగుబాయి క్షేత్రంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించే విధంగా దేవస్థాన కమిటీ సభ్యులు, అధికారులు సమన్వయంతో పని చేసి వేడుకలను విజయవంతం చేయాలని తెలిపారు. జాతరలో తాగునీరు, రహదారి సౌకర్యాలు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీరు, జాతరలో వైద్య శిబిరం, పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. జిల్లాలోనే కాకుండా ఇతర రాష్ట్రాల భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పర్యవేక్షించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా అధికారులు అప్రమత్తత చర్యలు తీసుకోవాలని తెలిపారు. అధికారులు, దేవస్థాన కమిటీ ప్రతినిధులు సమన్వయంతో కృషి చేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని తెలిపారు. అనంతరం జంగుబాయి ఉత్సవాలకు సంభందించిన గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, డీఎస్పీ కరుణాకర్, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, ఎంపీడీఓ అంజత్ పాషా, ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే అత్యుత్తమ ఫలితాలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ప్రణాళికా బద్ధంగా చదివితే అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చని మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ అన్నారు. మండలంలోని జీడిచేను మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలతో పాటు కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని శనివారం జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్‌తో కలిసి తనిఖీ చేశారు. జీడిచేను పాఠశాలలో అన్ని సబ్జెక్టులకు సంబంధించి విద్యార్థుల కనీస అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. పాఠశాలలోని గ్రంథాలయ పుస్తకాల వినియోగం, అమ్మ ఆదర్శ పాఠశాల కింద జరిగిన పనులను పరిశీలించారు. సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు గురుకుల, నవోదయ ప్రవేశ పరీక్షల ఉచిత కోచింగ్ నిర్వహిస్తున్న జీడిచెను పాఠశాల ఉపాధ్యాయులైన పుల్లూరి బాలకృష్ణ, లావణ్యలను అభినందించారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పదవ తరగతి విద్యార్థులకు సంబంధించి పాఠ్యాంశాలు పూర్తయ్యాయా, నోట్స్‌లు రాస్తున్నారా..? అనే విషయాలు తెలుసుకోవడంతో పాటు విద్యార్థుల గణిత సామర్థ్యాలను పరీక్షించారు. పదవ తరగతి విద్యార్థులను ఉద్దేశించి ఎంఇఒ, జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్ మాట్లాడుతూ జనవరి నుంచి ప్రతి రోజు క్రమం తప్పకుండా షెడ్యూల్ ప్రకారం అన్ని పాఠ్యాంశాలు చదువుకోవాలని, అదేవిధంగా వారాంతపు పరీక్షలు రాయడం ద్వారా వార్షిక పరీక్షలలో మంచి ఫలితాలు సాధించవచ్చని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు.

చేపల పెంపకం ద్వారా అధిక ఆదాయాన్ని పొందాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-వాంకిడి



చేపల పెంపకం ద్వారా అధిక ఆదాయాన్ని పొందాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం మండలంలోని సరండి గ్రామంలో చేపల పెంపకానికి రైతులు ఏర్పాటు చేసుకున్న చేపల చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చేపల పెంపకం ద్వారా అధిక ఆదాయాన్ని పొందేలా పెంపకందారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామానికి చెందిన ఏడుగురు గిరిజన రైతులు సుమారు 15 ఎకరాలలో నిర్మించుకున్న చేపల చెరువులలో అధిక లాభాలు వచ్చే చేపల రకాలు పెంచి మరింత ఆదాయాన్ని పొందాలని తెలిపారు. చెరువులలో చేపల పెంపకంపై రైతులకు అధికారులు సూచనలు, సలహాలు అందించాలని, చేపల పెంపకం వైపు రైతులను ప్రోత్సహించాలని, ఆ దిశగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి సాంబశివరావు, తహసీల్దార్ రియాజ్ అలీ, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వే వేగవంతం చేయాలి



నవతెలంగాణ-కెరమెరి

ఇందిరమ్మ ఇండ్ల సర్వే ఎలాంటి తప్పులకు తావు లేకుండా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల సర్వేను శనివారం మండలంలోని ఉదానగర్‌లో దరఖాస్తుల ఆధారంగా సర్వే సిబ్బంది చేస్తున్న ఇంటింటి సర్వేను తనిఖీ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలు ప్రత్యేక మొబైల్ యాప్‌లో నమోదు చేస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మార్గదర్శకాలకు అనుగుణంగా పక్కాగా లబ్ధిదారుల వివరాలను సేకరిస్తూ ఆన్‌లైన్‌లో సజావుగా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఇందిరమ్మ పథకం కింద పూర్తిస్థాయి అర్హత గల పేద కుటుంబాలకు ఇండ్లను అందజేసే లక్ష్యంతో సర్వే చేయాలని తెలిపారు. ఎక్కడైనా అవకతవకలకు పాల్పడితే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఇచ్చిన సమాచారం ప్రకారం ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామన్నారు. సర్వేకు దరఖాస్తు చేసుకున్న వారు సహకరించాలన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శి గణేష్, సిబ్బంది నరేష్ పాల్గొన్నారు.

డిజిటల్ ల్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కెరమెరి

గిరిజన విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న డిజిటల్ ల్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం జిల్లాలోని హట్టి ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన డిజిటల్ ల్యాబ్‌ను ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ అధికారి ఖుష్బూ గుప్తాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు, ఉపాధ్యాయులు తరగతులలో బోధించే పాఠ్యాంశాలతో పాటు డిజిటల్ ల్యాబ్‌ల ద్వారా అర్థం కాని విషయాలను నేర్చుకుని వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలిపారు. పాఠశాల తరగతులు ముగిసిన తర్వాత విద్యార్థులు ప్రతిరోజు ఒక గంట సేపు డిజిటల్ ల్యాబ్‌లో కూర్చుని అర్థం కాని పాఠాలను వినాలని సూచించారు. జిల్లాలోని హట్టి, ఆసిఫాబాద్ బాలికల ఆశ్రమ పాఠశాలలలో డిజిటల్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు కె.రమాదేవి, ఎసిఎంఓ ఉద్ధవ్, జీసిడిఓ శకుంతల, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హామీల అమలుకు సమరశీల పోరాటాలను నిర్వహిస్తాం

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గత ఎన్నికల ముందు రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు చేపట్టిన సమ్మెల సందర్భంగా గత ప్రభుత్వం నాటి కాంగ్రెస్ నాయకత్వం ఇచ్చిన హామీలను మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ చర్లపల్లి ఓ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన సీఐటీయూ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సమావేశంలో జిల్లా ప్రతినిధిగా హాజరై మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికులకు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు, మధ్యాహ్నం భోజన కార్మికులకు, ప్రభుత్వ ఆస్పత్రుల కార్మికులకు, ఐకేపీ సిబ్బందికి రూ.26వేలు కనీస వేతనం అందించాలని అన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో కార్మికులను ఐక్యం చేసి సమరశీల పోరాటాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ఎన్నికల్లో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎన్నికల మేనిఫెస్టోలో కార్మికోద్యోగులకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని అన్నారు. కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ పెన్షన్ ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. గత ప్రభుత్వంలో కార్మికుల సమస్యలను పట్టించుకోలేదని ఆరోపించారు. కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ టైం స్కేల్ డైలీ వేజ్ కార్మికుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వమైనా కార్మిక ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని, లేనిపక్షంలో పోరాటాలకు కార్మిక వర్గం సిద్ధంగా ఉంటుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-నిర్మల్

ఇసుక అక్రమ రవాణా చేస్తే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లాలో ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇసుక అక్రమ తవ్వకాలను గుర్తించి, పూర్తిస్థాయిలో నిర్మూలించాలని సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న నిర్మాణాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాలకు అవసరమయ్యే ఇసుకను కేవలం నిబంధనల మేరకు మాత్రమే సేకరించాలన్నారు. ఇందుకు అనుగుణంగా ఆ నిర్మాణాల గుత్తేదారులకు తగు ఆదేశాలు జారీ చేయాలన్నారు. ఆయా నిర్మాణాలకు అవసరమయ్యే ఇసుక వివరాల నివేదికలను అందజేయాలని సూచించారు. నివేదికల ప్రకారమే ఆయా శాఖలో జరుగుతున్న నిర్మాణాలకు ఇసుక సరఫరా చేయబడుతుందని, గుత్తేదారులు నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇసుకను కొనుగోలు చేయరాదని ఆదేశించారు. అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ ఇసుక అక్రమ తవ్వకాలను, రవాణాను అరికట్టాలన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఏడీ మైన్స్ రవీందర్, ఇంజనీరింగ్ శాఖల అధికారులు శంకరయ్య, అశోక్ కుమార్, సందీప్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భిక్షాటన నియంత్రణకు చర్యలు చేపట్టాలి

నవతెలంగాణ-నిర్మల్

భిక్షాటన నియంత్రణకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రంలోని బాలల సంక్షేమ కమిటీ కార్యాలయాన్ని ఆమె స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి సందర్శించారు. జిల్లాలో కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలు, బాల్యవివాహాల నియంత్రణ, అనాధ బాలల గుర్తింపు, ఇతర అంశాలపై సీడబ్ల్యూసీ సభ్యులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో జనవరి 01 నుంచి భిక్షాటన నియంత్రించేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భిక్షాటన నిషేధ చట్టం కఠినంగా అమలు చేయాలనీ సూచించారు. పట్టణాలలోని ముఖ్య కూడలలో భిక్షాటన చేస్తున్నా వారిని గుర్తించి, పునరావాస కేంద్రాలను తరలించాలన్నారు. పునరావాస కేంద్రాలలో భిక్షగాళ్లకు ఆశ్రయం, ఆహారం, విద్య, స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందించాలని తెలిపారు. భిక్షాటనను నియంత్రించేలా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. భిక్షాటనను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పోలీస్‌శాఖ ద్వారా ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి భిక్షాటన నియంత్రణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే జిల్లాలో బాల్యవివాహాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాల్య వివాహాలు చేసిన, ప్రోత్సహించిన సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి మురళి, సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఆర్టీల సమ్మెకు సంఘీభావం

నవతెలంగాణ-ఉట్నూర్

ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట తెలంగాణ రాష్ట్ర ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ చేస్తున్న నిరవధిక సమ్మె 13వ రోజు చేరుకుంది. ఈ సమ్మెకు శనివారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఆదిలాబాద్ మాజీ జెడ్పీ చైర్మెన్ జనార్దన్ రాథోడ్‌లు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం చెందిందని అన్నారు. గత ఆరు నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదని, ఉద్యోగ భద్రత, సర్వీసులను క్రమబద్ధీకరణ చేయాలని అన్నారు. ప్రమాదాల బారిన చనిపోయిన సీఆర్టీలకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నపుడు తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఇచ్చిన హామీ మేరకు చాలా మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ మహిళా నాయకురాలు పెందూర్ పుష్పారాణి, బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్, గిరిజన లంబాడీల ఐక్యవేదిక ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు జాదవ్ గణపత్ నాయక్, లైవ్ జిల్లా ఇన్‌చార్జి బానోత్ రవీందర్, మాజీ ఎంపీపీ జైవంతరావు, నార్నూర్ మండల సింగల్ విండో చైర్మెన్ ఆడే సురేష్, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పాయల శంకర్ సంఘీభావం..

ఉట్నూర్ ఐటీడీఏ ఎదుట గత 13 రోజుల నుంచి కొనసాగుతున్న గిరిజన ఆశ్రమ పాఠశాల కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్‌ల సమ్మెకు శనివారం ఎమ్మెల్యే పాయల శంకర్ సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటని నిలబెట్ట కోకపోవడం సిగ్గు చెటన్నారు. సమస్యల పరిష్కారంలో సర్కార్ విఫలం అయిందని మండిపడ్డారు. ఎమ్మెల్యే వెంట బీజేపీ రాష్ట్ర నాయకులు రాథోడ్ రితేష్, జిల్లా నాయకులు, బానోత్ జగన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండరి రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు, మండల నాయకులు, సీఆర్టీలు ఉన్నారు.

సీఆర్టీ ఉపాధ్యాయుల ర్యాలీ..

ఉట్నూర్‌లో సీఆర్టీ ఉపాధ్యాయులు శనివారం ఐటీడీఏ కార్యాలయం నుంచి ఐబీ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అంబేద్కర్ విగ్రహానికి అందజేశారు.

సీఈ జెఆర్ చవాన్‌కు సన్మానం

ఉట్నూర్ : విద్యుత్‌శాఖ చీఫ్ ఇంజనీర్‌గా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన చవాన్ జైవంత్‌రావుని శనివారం ఉట్నూర్ విద్యుత్‌శాఖ కార్యాలయంలో శాలువాలతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ మాజీ ఎంపీపీ, ఉట్నూర్ మండలాధ్యక్షులు పంద్ర జైవంత్‌రావు, డీఈ సుభాష్, నాయకులు సిరాజ్, సాయికుమార్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
ఆదివారం | డిసెంబర్ 29, 2024 | www.navatelangana.com

పేదలకు దుప్పట్ల పంపిణీ



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పొనకల్ గ్రామంలో మండల మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ శనివారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తీవ్రమైన చలి కారణంగా వృద్దులు, పేదలు ఇబ్బంది పడుతున్న వారికి దుప్పట్లను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర కరిమల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఏ లక్ష్మణ్, తాజా మాజీ వార్డ్ మెంబర్ జాజాల శ్రీకాంత్, కడార్ల నర్సయ్య, నోముల రాజ్ కుమార్, రాగుల శంకర్, రాఘవేంద్ర విద్యాసంస్థల కళాశాల, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదింటి ఆడపడుచు పెండ్లికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని చింతాగూడా గ్రామానికి చెందిన సంపంగి లక్ష్మి కూతురు సంపంగి రజిత వివాహానికి ఉప్పు సురేష్ శనివారం రూ.5000 ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఉప్పు సురేష్‌కు రజిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదింటి అమ్మాయి పెళ్లికి దాతలు ముందుకు వచ్చి సహకరించాలన్నారు. పెండ్లి పెద్దలుగా నిలిచి ఆ పేదింటి అమ్మాయి పెళ్లికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో చింతగూడ గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్లోబల్ విజన్‌పై విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-జన్నారం

ప్రపంచం వేగంగా మారుతున్న ఈ కాలంలో, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, గ్లోబల్ సమస్యలపై అవగాహన, విమర్శనాత్మక ఆలోచన సామర్థ్యాలను అభివృద్ధి చేయడం అత్యంత అవసరం అని ప్రముఖ న్యాయవాది పోలంపల్లి సురేందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్లేట్ ఎక్సెలెన్స్ పాఠశాలలో ప్రారంభమైన మోడల్ యునైటెడ్ నేషన్స్ (ఎంయూఎన్) సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మోడల్ యునైటెడ్ నేషన్ లక్ష్యానికి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో 80 మందికిపైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, లోక్‌సభ, , యూఎన్‌హెచ్‌ఆర్‌సీ, ఈసీఓఎస్‌ఓసీ కమిటీలలో చర్చలు జరిపారు. పబ్లిక్ స్పీకింగ్, చర్చా నైపుణ్యాలు, సహకార సామర్థ్యాలను అభివృద్ధి చేసేందుకు ఇది ఓ చక్కని వేదికగా నిలుస్తుంది అన్నారు. కార్యక్రమానికి లయన్స్ డే విత్ యునైటెడ్ నేషన్స్‌లో ప్రాతినిధ్యం వహించిన న్యాయవాది పొరపల్లి సుందర్ ముఖ్య అతిథిగా హాజరై, ఈ సమావేశానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. యువతలో అవగాహన నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో ఈ తరహా కార్యక్రమాలు కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ కమిటీలకు శ్రేయాస్‌రెడ్డి (లోక్‌సభ), సుప్రీత్‌రెడ్డి (యూఎన్‌హెచ్‌ఆర్‌సీ), వల్లభరెడ్డి (ఈసీఓఎస్‌ఓసీ)చైర్మన్‌గా సేవలందించారు. వారి మార్గనిర్దేశనంలో విద్యార్థులు చర్చల్లో భాగస్వాములయ్యారు.కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి, స్లేట్ హై స్కూల్ ప్రిన్సిపాల్ షిరిన్ ఖాన్, స్లేట్ ఎక్సలెన్స్ స్కూల్ ప్రిన్సిపాల్ ష్యామ్ లాల్ ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నాయకులు, కార్యకర్తలపై దాడి చేస్తే ఊరుకోం : ఆప్ నాయకులు



నవతెలంగాణ-నస్పూర్

ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తే ఊరుకోమని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి కన్వీనర్ సుధాకర్ అన్నారు. శనివారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. డిసెంబర్ 18వ తేదీన ఆమ్ ఆద్మీ పార్టీ మంచిర్యాల జిల్లా నాయకుడైన నయీమ్ పాషాపై జరిగిన దాడిని ఖండిస్తున్నట్లు తెలిపారు. ఆమ్ ఆద్మీ పార్టీ ప్రజల పక్షాన పనిచేస్తుందని, ఉద్యమాలలో దాడులు జరగడం సహజమేనని, కానీ వెన్నుపోటు దాడులు సరికాదని అన్నారు. అరెస్టులు, దాడులతో ఉద్యమాన్ని ఆపలేరని, దాడులకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యం వహిస్తున్నారని, సీపీకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆమ్ ఆద్మీ పార్టీ కోర్ కమిటీ సభ్యుడు రాముగౌడ్, మజీద్, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు నల్ల నాగేంద్రప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి నయీం పాషా, నిర్మల్ జిల్లా ప్రెసిడెంట్ హైదర్, రాష్ట్ర యూత్ ప్రెసిడెంట్ విజయ్ మల్లంగి, బోధన్ నియోజకవర్గ ఇన్‌చార్జి జునైద్, కూకట్పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి వికాస్, మంచిర్యాల జిల్లా యూత్ ప్రెసిడెంట్ మేకల శ్రీనివాస్, మంచిర్యాల జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు రాజేందర్ పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

- యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి



నవతెలంగాణ-దండేపల్లి

విద్యార్థులు యువత మత్తు పాదాలకు దూరంగా ఉండి వ్యసనాలకు బానిసలు కాకూడదని యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి అన్నారు. శనివారం మండల తహసీల్దార్ సంధ్యారాణి చేతుల మీద సంఘం ఆధ్వర్యంలో గోడ ప్రతులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని తమ లక్ష్యాల వేటలో ముందుండాలని కోరారు. యువతకు విద్యార్థి దశ అనేది చాలా కీలకమైందని ఈ దశలో మత్తు పదార్థాలకు బానిస ఇటు తమ బంగారు భవిష్యత్తు అటు తమ కుటుంబాలకు దూరమవుతారని అన్నారు. డ్రగ్స్ సేవించిన ప్రోత్సహించిన కఠినమైన శిక్షలు ఉంటాయని భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఉంటాయని అన్నారు. విద్యార్థులు యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామ పంచాయతీ ఉద్యోగులు

నవతెలంగాణ-నస్పూర్

గత ప్రభుత్వం ఇచ్చిన జీఓ నెం. 51ని సవరించి, పెండింగ్ వేతనాలు సవరించాలని గ్రామ పంచాయతీ యూనియన్(సీఐటీయు) గౌరవ అధ్యక్షుడు దుంపల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగుల రెండు రోజు టోకెన్ సమ్మెలో భాగంగా శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రజలకు ఎలాంటి అంటూవ్యాధులు, జబ్బులు రాకుండా అనారోగ్య బారిన పడకుండా ప్రజలకు సేవలు అందిస్తున్నారని, గత ప్రభుత్వం జీఓ నెం.51ని తీసుకొచ్చి, మల్టి పర్పస్ వర్కర్స్ విధానం ద్వారా కార్మికులపై పని భారం మోపుతూ బలవంతంగా పనులు చేపిస్తున్నారన్నారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించడం లేదని, దింతో కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. జనాభా పెరుగుతున్న కొద్దీ అదనంగా కార్మికులను విధుల్లోకి తీసుకున్నారు. కానీ ఆన్‌లైన్‌లో పేర్లు ఎక్కించలేదని ఆరోపించారు. తక్కువ వేతనాలు ఇస్తూ పనులు చేపిస్తున్నారని, ప్రతి నెల వేతనాలు సక్రమంగా రాకపోవడంతో కుటుంబాన్ని పోషించుకోవడానికి ఇంటి అద్దెలు, పిల్లల చదువులకు, చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అంతే కాకుండా గ్రామాల్లో అధికారుల వేధింపులు పెరిగాయని, పండుగలకు, ఆదివారం ఎలాంటి సెలవులు ఇవ్వడం లేదని, కావున ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మల్టీ పర్పస్ విధానం రద్దు చేయాలని, వేతనాలు సక్రమంగా ప్రతి నెల చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిస్కారం చేయకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అంబటి లక్ష్మణ్, గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా కన్వీనర్ రామిళ్ళ రాయలింగు, జిల్లా కోకన్వీనర్ చిన్నయ్య, సాగర్, అవునూరి రాజలింగు, రాజన్న, సుధాకర్, బాణయ్య, బాపు, రవి, దుర్గ, లక్ష్మి, యశోద, లత, మంగ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు, వేతనాలు వెంటనే చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ అధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి

నవతెలంగాణ-తాండూర్

మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు, వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి కోరారు. శనివారం బెల్లంపల్లి పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు గత 4 నెలలుగా బిల్లులు, వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే బిల్లులు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికారంలోకి వస్తే రూ.10 వేల వేతనం, ఇతర సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. గత ప్రభుత్వం వ్యవహరించిన మదిరి గానే ప్రస్తుత ప్రభుత్వం కూడా వ్యవరిస్తుందన్నారు. ఇచ్చిన హామీలను అమలు జరపకపోతే రాబోయే కాలంలో పోరాటాలకు సిద్ధమవుతామని తెలిపారు. ఈ సమావేశంలో నక్క శారద, ముడిమడుగుల సరోజ, పాలెం రాజమ్మ, శ్యామల రాజేశ్వరి, ఓదెమ్మ, సుద్దాల కళావతి, సిద్ధం సత్య అక్క, మల్లక్క, ప్రమీల, కొమురక్క, చంద్రకళ, మాలతి, అబ్జర్బీ పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- జంగ్ సైరన్ వాల్ పోస్టర్లు విడుదల

నవతెలంగాణ జన్నారం



జంగ్ సైరన్ వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్ఐ

యువత, విద్యార్థుల మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జన్నారం ఎస్ఐ రాజ వర్ధన్ అన్నారు. శనివారం నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ (ఎన్ఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్ ప్రసాద్ పటేల్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా రూపొందించిన జంగ్ సైరన్ వాల్ పోస్టర్లను ఎస్ఐ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంత మంది యువత, విద్యార్థులు కిక్కు కోసం దమ్ము కొట్టడం, మందు కొట్టడం లాంటివి ప్రారంభించి క్రమంగా వాటికి అలవాటు పడి భానిసలవుతారన్నారు. కొందరు ఆకతాయిలు చేసే అలవాట్ల వల్ల యువత తమ భవిష్యత్‌ని నాశనం చేసుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్‌కి అలవాటైన యువత సమాజానికి దూరం అయ్యే ప్రమాదం ఉందని, తమ సన్నిహితులు తమ వద్దకు రావాలన్న కూడా జంకే పరిస్థితులు ఏర్పడతాయన్నారు. యువత డ్రగ్స్‌కి దూరంగా ఉండి సమాజానికి దగ్గరగా ఉండాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్‌కి దూరంగా ఉందాం, సమాజంతో దగ్గరగా ఉందాం అనే స్లోగన్‌తో నవతరం స్టూడెంట్ విద్యార్థి సంఘం జంగ్ సైరన్ అనే కార్యక్రమం తీసుకోవడం చాలా సంతోషం అన్నారు. యువత, వారి తల్లిదండ్రులు కూడా డ్రగ్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సరదా కోసం చేసుకునే చిన్న చిన్న అలావట్లే రేపటి రోజున మీ కుటుంబాన్ని అంధకారంలోకి నెట్టేయొచ్చని, నీకు భవిష్యత్ లేకుండా చెయ్యొచ్చు, నీ కుటుంబంతో నువ్వు సమయాన్ని గడపకుండా చేయొచ్చు అని, అదే విధంగా డ్రగ్స్ తీసుకున్న వారిని సరఫరా చేసినా.. వాటిని ప్రోత్సహించిన కూడా కఠిన శిక్షలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు ఈశ్వర్, హత్తిరామ్, అఖిల్ పాల్గొన్నారు.

పల్లె సంస్కృతిని కాపాడుకుందాం



నవతెలంగాణ-జన్నారం

మల్లె సంస్కృతిని కాపాడుకుందాం అని, ప్రముఖ గేయ రచయిత ప్రజా గాయకుడు వరంగల్ శ్రీనివాస్ అలియాస్ బొడ్డు శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో ఆదర్శ కళా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన, వరంగల్ శ్రీనివాస్ రచించిన నూరేళ్ల నా ఊరు గేయ కావ్యం అయినా ఓయమ్మ నా పల్లె సీమ, కు గాయని గాయకుల ఎంపిక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పల్లె సంస్కృతులు అంతరించిపోతున్న తరుణంలో, 243 చరణాలతో నూరేళ్ల నా ఊరు, ఓయమ్మ నా పల్లె సీమ అనే గేయ కావ్యాన్ని రచించడం జరిగింది అన్నారు. అంతరించిపోతున్న పల్లె సంస్కృతి సాంప్రదాయాలను భవిష్యత్ తరాల కోసం కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సమాజంలో సాంకేతిక రంగం వృద్ధి చెందుతున్న గ్రామంలో అనాదిగా వస్తున్నటువంటి సంస్కృ కనుమరుగ అయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. మానవ విలువలు బందు ప్రీతి, దెబ్బతింటున్నాయన్నారు.

ఈ అంశాలను అన్నిటినీ దృష్టిలో పెట్టుకొని ఆ గేయాన్ని రచించడం జరిగిందన్నారు. ఈ చరణాలపై పాటలు పాడటానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి గాయని గాయకులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి జిల్లాలో గాయని గాయకులు సద్వినియోగం చేసుకున్నారు. కార్యక్రమంలో, దుందాం వ్యవస్థాపకుడు అంతడుపుల నాగరాజు, సంగీత దర్శకుడు మల్లిక్ తేజ, మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, పోనకాల్ తాజా మాజీ సర్పంచ్ జాక్కు భూమేష్, ఆర్టిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లపల్లి రాజేశ్వర్, గాయకులు జూపక శీను, ఉప్పులేటి నరేష్, కొండు జనార్దన్, లింగంపల్లి రాజలింగు, ముల్కల్ల మురళి, లవుడియా రమేష్, బీర్పురి శ్రీనివాస్, పాల్గొన్నారు.

ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు



నవతెలంగాణ-మంచిర్యాల

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జిల్లాలోని ప్రజలకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తించిన ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని డీసీపీ ఏ భాస్కర్ అన్నారు. శనివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో జిల్లాకు చెందిన పాత నేరస్థులు, రౌడీషీటర్స్‌కు కౌన్సిలింగ్ నిర్వహించారు. డిసెంబర్ 31 రాత్రి జరిగే నూతన సంవత్సర వేడుకల్లో ఏటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదని, ప్రజలకు ఇబ్బందులు కలిగెల ప్రవర్తించిన, మద్యం సేవించి నిర్లక్ష్యంగా వేగంగా వాహనాలు నడపడం, ట్రిబుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్ చేయడం, గ్రూపులుగా తిరుగుతూ దాడులు, బెదిరింపులు, రోడ్లపై వెళ్ళేవారిని ఇబ్బదులకు గురి చేయడం లాంటి చట్ట వ్యతిరేకమైన కార్యకలపాలకు పాల్పడినట్లైతే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నూతన సంవత్సర వేడుకలను జిల్లా ప్రజలు శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా కుటుంబ సమేతంగా ఎవరి ఇండ్లలో వారు సంతోషంగా నిర్వహించుకోవాలని కోరారు. అనంతరం మంచిర్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి సిబ్బందికి తగిన సూచనలు అందించారు. కార్యక్రమంలో ఏసీపీ ఆర్ ప్రకాష్, సీఐ ప్రమోద్ రావ్, నరేష్ కుమార్, ఎస్ఐ ప్రవీణ్ పాల్గొన్నారు.

వైభవంగా గణిత దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలోని నారాయణ పాఠశాలలో శనివారం గణిత దినోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. వేడుకలకు నారాయణ విద్య సంస్థల ఏజీఎం చైతన్య రావు ముఖ్య అతిథిగా హాజరై గణిత శాస్త్రం గొప్ప తనన్ని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా గణితంపై విద్యార్థులు చేసిన ప్రదర్శనలు పలువురిని ఆకర్షితులను చేసింది. ప్రదర్శనలో ముందు నిలిచినా విద్యార్థులను ఏజీఎం చైతన్య రావు అభినందించారు. అనంతరం గణిత శాస్త్ర ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కవిత పాఠశాల సిబ్బంది జ్యోతి, వెంకటస్వామి, సంజీవ్ పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావేదిక



నవతెలంగాణ-లక్షెట్టిపేట

ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం 14వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఎంపీడీఓ కె సరోజ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ కిషన్ పాల్గొని మాట్లాడారు. పెనాలిటీ రూపేణా రూ.1100, రికవరీ రూపేణా రూ.33088 మొత్తం రూ.44088 మండలంలోని 18 గ్రామ పంచాయతీ లలో ఉపాధిహామీ ద్వార 2023 ఏప్రిల్ నుండి 2024 మార్చి వరకు రూ. రెండు కోట్ల 36 లక్షలు ఖర్చు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబుడ్స్ మెన్ శివరాం, అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ కిరణ్, ఎస్‌టీఎం వేణు, ఎంపీడీఓ సరోజ, ఏపీఓ వేణుగోపాల్, ఈసీ స్వామి ఉన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వేను వేగవంతం చేయండి

నవతెలంగాణ-తాండూర్

ఇందిరమ్మ ఇండ్ల సర్వేను వేగవంతం చేయాలని ఎంపీఓ అనిల్ సూచించారు. శనివారం బోయపల్లి గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పర్యవేక్షించారు. ఇంటి స్థితిగతులను తెలియజేసే విధంగా సంబంధించిన యాప్‌లో ఫోటోలను అప్లోడ్ చేయాలని సూచించారు. సర్వే చేసే దరఖాస్తుదారులకు ఒకరోజు ముందే సమాచారాన్ని అందించి మరుసటి రోజు సర్వే కోసం వెళ్లాలని తెలిపారు. ఆయనతో పంచాయతీ కార్యదర్శి కార్తీక్ ఉన్నారు.

